


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
29-03-2025
పేజీలు: 02



## ఉద్యోగులకు డీఏ పెంచుతూ కేంద్రం నిర్ణయం

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 2 శాతం పెంచుతున్నట్లు మోడీ ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఉద్యోగులకు డీఏ పెంచుతూ ఈ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తాజా పెంపుతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 53 శాతం నుంచి 55 శాతానికి పెరిగింది. అటు, రూ.22,919 కోట్లతో పీఎల్ఐ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయ ఎలక్ట్రానిక్స్ రంగానికి ఊతం లభించనుంది. ముఖ్యంగా నాన్ సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు చేయూతనివ్వడమే ఈ కొత్త పథకం ముఖ్య ఉద్దేశం.



## మోడీతో విజయ్ దేవరకొండ!

మన టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా ఇపుడు భారీ చిత్రం కింగ్డమ్ చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమా షూటింగ్ ఇపుడు అంతిమ దశకు చేరుకోగా అభిమానులు చాలా ఎగ్జైటెడ్ గా ఈ సినిమా పట్ల ఉన్నర్మ్ ఇక ఇదిలా ఉండగా మన సెన్సేషనల్ హీరో దేశ ప్రధాని నరేంద్ర మోడీతో కనిపించడం వైరల్ గా మారింది. అయితే నిన్న మార్చ్ 28న జరిగిన వాట్ ఇండియా థింక్స్ టుడే అనే కార్యక్రమంలో ప్రధాని మోడీ సహా అమిత్ షా అలానే ఇంకొందరు రాజకీయ ప్రముఖులు సినీ ప్రముఖులు కూడా హాజరు కావడం జరిగింది. ఇలా మోడీతో విజయ్ దేవరకొండ అలానే నటి యామి గౌతమ్ కూడా కనిపించడం బ్యూటిఫుల్ మూమెంట్ గా మారింది. దీనితో ఈ పిక్ సోషల్ మీడియాలో సహా సినీ వర్గాల్లో వైరల్ గా మారింది.



### వక్ఫ్ సవరణకి మద్దతు ఇచ్చిన పార్టీలన్నీ ముస్లింల

# గుండెలకు తుపాకీ ఎక్కుపెట్టినట్లే

భారత రాజ్యాంగానికి భవిష్యత్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్ప పొంచి ఉందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. దేశంలో హిందువులతో ముస్లింలకు కానీ.. ముస్లింలతో హిందువులకు కాని ఎలాంటి ముప్ప లేదని.. కేవలం ఆర్ఎసఎస్ భావజాలాన్ని అమలుచేస్తోన్న బీజేపీ, నరేంద్ర మోదీ, యూపీ సీఎం యోగిల నుంచే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం జుమ్మాతుల్ విదా ప్రార్ధనల అనంతరం ఫతే దర్వాజా వజీర్ అలీ మసీదులో ఏర్పాటు చేసిన యౌముల్ ఖురాన్ కార్యక్రమంలో అసదుద్దీన్ ఒవైసీ ప్రసంగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. బీజేపీ మోదీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన చంద్రబాబు నాయుడు (తెలుగుదేశం), నీతీష్‌కుమార్(జేడీయూ), చిరాగ్ పాశ్వాన్(ఎల్‌జేపీ-రాం విలాస్ పాశ్వాన్), జయంత్‌చౌదరి(ఆర్ఎల్‌డీ)లను భారతీయ ముస్లింలు విశ్వసించరని స్పష్టం చేశారు. ముస్లింల గుండెలకు తుపాకీ ఎక్కు పెట్టినట్టుగా

మారిన వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతు ఇచ్చి, వారి ఆస్తులను లాక్కునేందుకు మద్దతు ఇచ్చిన పార్టీల నేతలను ముస్లింలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. దేవాలయాల ట్రస్ట్ బోర్డులో హిందువులు, గురుద్వారా బోర్డుల్లో సిక్కులు మాత్రమే సభ్యులుగా ఉండాలనే నిబంధనలు అమలు చేస్తున్న నేపథ్యంలో వక్ఫ్‌బోర్డుల్లో ముస్లిమేతరుల ప్రమేయాన్ని ఎలా అంగీకరిస్తారని ఒవైసీ ప్రశ్నించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు ఒవైసీతో పాటు ముస్లింలు చేతికి నల్లరంగు రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అనుసరిస్తున్న బీజేపీ, మోదీ, యోగిలతో దేశానికి ముప్ప ఉందని విమర్శించారు.



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్

ఈ ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజును దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగించాయి. సుంకాలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేయనున్న తరుణంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఆటో, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లపై ప్రభావం చూపింది. నిన్న ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 191 పాయింట్లు నష్టపోయి 77,414 వద్ద ముగిసింది.



## 'ఎక్స్'ను అమ్మేశా..

### ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన

టెస్లా బాస్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన చేశారు. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (గతంలో ట్విట్టర్)ను విక్రయించినట్లు ప్రకటించారు. తన సొంత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ అయిన xAIకి 'ఎక్స్'ను 33 బిలియన్ల డాలర్లకు విక్రయించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని మస్క్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ లావాదేవీ పూర్తిగా స్టాక్ రూపంలో జరిగిందని తెలిపారు. ఎక్స్ఏఐ విలువను 80 బిలియన్ డాలర్లుగా నిర్ధరించారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు. ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత మస్క్ అనేక మార్పులు చేపట్టారు. సంస్థ పేరును ట్విటర్ నుంచి 'ఎక్స్'గా మార్చారు. అదేవిధంగా ట్విట్టర్ పిట్ట స్థానంలోకి 'X'ను చేర్చారు. దాదాపు 75 శాతం మంది ఉద్యోగులను తొలగించారు. కంటెంట్ విషయంలోనూ అనేక మార్పులు తీసుకొచ్చారు. ఇక చాట్‌జీపీటీకి పోటీగా గతేడాది మస్క్ 'ఎక్స్ఏఐ' పేరుతో అంకుర సంస్థను ప్రారంభించారు.

## ఘిబ్లీ గ్యాంగ్‌లో చేరిన చంద్రబాబు



చాట్ జీపీటీ ఆఫర్ చేస్తున్న ఘిబ్లీ స్టూడియో ఫీచర్ ఇప్పుడు ట్రెండింగ్ అవుతోంది. ప్రముఖులు సైతం ఒక్కొక్కరుగా ఘిబ్లీ సాయంతో తమ ఫొటోలను యానిమే స్టయిల్లోకి మార్చుకుంటున్నారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ఘిబ్లీ గ్యాంగ్ లో చేరానని ప్రకటించగా... తాజాగా తాను కూడా ఎంట్రీ ఇచ్చానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఘిబ్లీ ట్రెండ్ లో చేరుతున్నాను... ఇదిగో నా ఎంట్రీ అంటూ చంద్రబాబు పలు ఫొటోలను పంచుకున్నారు. కూటమి విజయోత్సవ సభలో తాను, ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్న ఫొటో... తన ఫ్యామిలీ ఫొటో, వరద బాధితుల పరామర్శ ఫొటోను చంద్రబాబు ఘిబ్లీ స్టయిల్లోకి మార్చి, వాటిని సోషల్ మీడియాలో షేర్ చేశారు.



## లొకేషన్‌లో ఆయన్ని చూస్తే భయమేసింది

సన్నీడియోల్ కథానాయకుడిగా టాలీవుడ్ డైరెక్టర్ మలినేని గోపీచంద్ దర్శకత్వం వహించిన బాలీవుడ్ 'జాట్' చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈసినిమాలో నటి రెజీనా కసాండ్రా కీలక పాత్ర పోషిస్తున్నది. ఇటీవల ముంబయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఇందులోని తన పాత్ర గురించి, 'జాట్' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రెజీనా. ' 'జాట్'లో నా పాత్ర పేరు భారతి. ఇలాంటి పాత్రను పోషించడం నా కెరీర్‌లో ప్రథమం. తెరపై నన్ను చూసి ఆశ్చర్యపోతారు. ఇదొక విభిన్నమైన కథ. ఒక్క రాత్రిలో జరిగే పెను విస్ఫోటనం అని చెప్పొచ్చు. సన్నీడియోల్ నట విశ్వరూపం చూస్తారు. లొకేషన్‌లో ఆయన పెర్ఫార్మెన్స్ చూసి నిజంగా భయమేసింది. ఇక ఆడియన్ ఎలా ఫీలవుతారో అర్థం చేసుకోండి. దేవుడు దిగి వస్తే.. అన్నట్టుగా ఉంటుం ది ఆయన పాత్ర. ఇంతకంటే ఈసినిమా గురించి చెప్పకూడదు. డైరెక్టర్ మలినేని గోపీచంద్‌కి బాలీవుడ్‌లో పెద్ద బ్రేక్ ఈ సినిమా.' అని చెప్పింది రెజీనా.

## ఒకేసారి ఇద్దరు యువతులని పెళ్లిచేసుకున్న యువకుడు



తెలంగాణ రాష్ట్రంలోని అసిఫాబాద్ జిల్లాలో వింత సంఘటన వెలుగు చూసింది. ఒకే పెళ్లి మండపంలో.. ఒకేసారి ఇద్దరు యువతుల మెడలో తాళి కట్టి వార్తల్లోకెక్కాడు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగపూర్ మండలం గుమ్నూర్‌కు చెందిన సూర్యదేవ్ అనే యువకుడు. అంతేకాదు.. పెళ్లి శుభలేఖలోనే.. తాను ఇద్దరు యువతులను ఒకే సారి వివాహం చేసుకుబోతున్నట్లు ప్రకటించాడు. ఈ పెళ్లి చూడటం కోసం జనాలు భారీగా తరలి వచ్చారు. అలా వేయి మంది బంధుమిత్రుల సమక్షంలో.. వేదమంత్రాల సాక్షిగా.. ఇద్దరు యువతుల మెడలో మూడు ముళ్లు వేసి.. ముచ్చటగా ముగ్గురు అన్నట్లుగా వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఇక ఈ అరుదైన పెళ్లి వార్త కాస్త సోషల్ మీడియా తెగ వైరల్ అవుతోంది.మరి ఒకే సారి ఇద్దరిని పెళ్లిడిన సూర్యదేవ్ బాగా డబ్బున్న వ్యక్తా అంటే.. ఓ సాధారణ రైతు. మరి అతడు వివాహం చేసుకుంది అక్కాచెల్లెళ్లానా అంటే అది కూడా కాదు. పైగా ఆ ఇద్దరు యువతులు వేర్వేరు గ్రామాలకు చెందిన వారు. మూడేళ్ల కిందట ఈ ముగ్గురు మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు యువతులను ఒకేసారి ప్రేమించిన సూర్యదేవ్.. ఈ విషయాన్ని ముందగానే వారికి చెప్పాడు. అంతేకాక తనకు ఇద్దరు ముఖ్యమే అని.. అందుకే ఇద్దరిని పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ఆ యువుతులు కూడా సూర్యదేవ్‌ను వదులుకోవడం ఇష్టం లేక పెళ్లికి అంగీకరించారు. ఇద్దరు యువతులు పెళ్లికి అంగీకరించడంతో.. ఒకే పెళ్లి మండపంలో ఒకే ముహూర్తానికి వేయి మంది అతిథుల సమక్షంలో ప్రేమించిన ఇద్దరు అమ్మాయిలను పెళ్లి చేసుకుని.. ఇద్దరు భార్యల ముద్దుల భర్తగా వార్తల్లోకెక్కాడు. పైగా ఈ ఇద్దరికీ భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని బాండ్ కూడా రాసిచ్చాడు. ఇద్దరు అమ్మాయిల తల్లిదండ్రులు బాండ్‌ను అంగీకరించడంతో.. వారు ముచ్చటగా ముగ్గరయ్యారు.

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న

## వనపర్తి ఎమ్మెల్యే

వనపర్తిజిల్లాపెద్దమందడి మండలం వెల్టూర్ లోని మసీదులో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపాల్గొన్నారు. ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి, ఉపవాస దీక్ష విరమించ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బాలనాగయ్య, మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, డి. రమేష్, హఫీస్‌సాబు, రుక్మోద్దిన్‌బంగిస, షాపుద్దీన్, ఎండీ. నజ్జు, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న

## సహాయక చర్యలు

నాగర్ కర్నూల్ జిల్లాలోని దోమల పెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు 36వ రోజుకు చేరుకున్నాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు రెస్క్యూ బృందాలు నిర్విరామంగా కృషిచేస్తున్నాయి. ప్రమాదం జరిగి 36 రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ ఇద్దరు ఇంజనీర్ల మృతదేహాలు మాత్రమే లభించాయి. మిగిలిన ఆరుగురి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం సైతం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్ క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు సహాయ చర్యలు చేపట్టేందుకు సొరంగంలోకి వెళ్లాయి. ఇంత శ్రమిస్తున్న శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదన్న ఆవేదనతో అధికారులు, రెస్క్యూ బృందాలు, కార్మికులు ఉన్నారు. సొరంగంలోకి ఉబికి వస్తున్న నీటి ఊటను నిలువరిస్తే తప్ప సహాయక చర్యలు ముందుకు సాగవనేది రెస్క్యూ బృందాలు చర్చించుకుంటున్నట్లు తెలుస్తుంది. ప్రత్యేక అధికారి శివశంకర్ ఎప్పటికప్పుడు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ సలహాలు సూచనలు చేస్తూ అత్యాధునిక పరికరాలతో సహాయక చర్యలు చేపడుతున్నప్పటికీ టన్నెల్లో చిక్కుకున్న కార్మికులను బయటకు తేలేకపోతున్నారు. జీఎస్ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకు బారికేడింగ్ చేశారు. టెలిటెల్, బాక్స్ క్రీప్ స్ట్రక్చర్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నా మృతదేహాలు బయటకు తీయలేకపోతున్నామనే నిరాశ రెస్క్యూ బృందాలో నెలకొంటుంది. ప్రమాద ప్రదేశం సమీపంలో మట్టి కింద ఉన్న లోకో ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజిన్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం ఆ పనులు పూర్తయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సొరంగంలో చిక్కుకున్న లోకో ట్రైన్ విడిభాగాలను కటింగ్ చేసి బయటకు తరలిస్తున్నారు. పూర్తిస్థాయిలో ట్రైన్ ను మొత్తాన్ని బయటకు తీస్తే రెస్క్యూ బృందాలకు మృతదేహాలను తీసేందుకు మార్గం సులువుగా ఉంటుందని తెలుస్తోంది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM



# బ్రేకప్ రూమర్స్.. విజయ్ వర్మ కీలక వ్యాఖ్యలు

నటి తమన్నా, హీరో విజయ్ వర్మ రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల వారి రిలేషన్‌షిప్‌పై పలు రూమర్లు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తమన్నా, ముంబయిలో జరుగుతున్న ఈవెంట్‌లో విజయ్ తాజాగా పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లోనే రిలేషన్‌షిప్ గురించి మాట్లాడారు. రిలేషన్‌షిప్‌లో ప్రతీ విషయాన్ని ఆస్వాదించాలని ఆయన అన్నారు. ఈ రిలేషన్‌షిప్‌ను విజయ్ ఐస్‌క్రీమ్ ఫ్లేవర్స్‌తో పోల్చారు. 'రిలేషన్‌షిప్ గురించి మాట్లాడుతున్నారా? రిలేషన్‌షిప్‌ను ఓ ఐస్ క్రీమ్‌లాగా ఎంజాయ్ చేసినట్లైతే, మీరు ఆనందంగా ఉంటారు. దాని ఫ్లేవర్ ఏదైనా గానీ, కచ్చితంగా స్వీకరించాల్సిందే' అని విజయ్ పేర్కొన్నారు.అటు తమన్నా కూడా ఇటీవల ఓ సందేశాత్మక పోస్ట్ షేర్ చేశారు. 'జీవితంలో అద్భుతాలు జరగాలని ఎదురుచూడొద్దు. దాని బదులు మనమే అద్భుతాన్ని సృష్టించాలి' అని తమన్నా అమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఈ మెసేజ్ షేర్ చేశారు.కాగా, తాజాగా తమన్నా- విజయ్ జంట హోలీ వేడుకల్లో సందడి చేసింది. బాలీవుడ్ హీరోయిన్ రవీనా టాండన్ ఏర్పాటు చేసిన హోలీ సంబరాల్లో తమన్నా, విజయ్ వర్మ పాల్గొన్నారు. కానీ, వీరిద్దరూ ఈవెంట్‌కు విడివిడిగా వెళ్లారు. దీంతో ఈ రూమర్స్‌కు మరింత బలం చేకూరింది.

# మయన్మార్‌కు భారత్ సాయం.. 15 టన్నుల సామగ్రి తరలింపు

శక్తివంతమైన భూకంపాలతో గజగజలాడిన మయన్మార్, థాయిలాండ్‌కు కష్టకాలంలో సాయం చేసేందుకు భారత్ ముందుకు వచ్చింది. శుక్రవారమే అండగా ఉంటామని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. మోడీ పిలుపు మేరకు భారత విదేశాంగ శాఖ చొరవ చూపించింది. మోడీ ఆదేశాల మేరకు దాదాపు 15 టన్నుల సహాయ సామగ్రిని మయన్మార్‌కు పంపించారు. భారత వాయు సేనకు చెందిన C130J ప్రత్యేక విమానం హిండన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి బయల్దేరి వెళ్లింది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బాధితులకు అవసరమైన ఆహార పదార్థాలతో పాటు తాత్కాలిక నివాసం కోసం టెంట్లు, స్లీపింగ్ బ్యాగ్స్, వాటర్ ప్యూరిఫయర్లు, సోలార్ ల్యాంప్, జనరేటర్లు, అత్యవసర వైద్య పరికరాలను మయన్మార్‌కు పంపించినట్లు తెలుస్తోంది.శుక్రవారం మధ్యాహ్నం శక్తివంతమైన భూకంపాలు కారణంగా మయన్మార్, బ్యాంకాక్ గజగజ వణికిపోయాయి. పెద్ద పెద్ద బిల్డింగ్‌లు కుప్పకూలిపోయాయి. ఇప్పటి వరకు 700 మంది చనిపోగా_ _ _ వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ఇంకా వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. ప్రస్తుతం రెస్క్యూ సిబ్బంది సహాయ చర్యలు కొనసాగిస్తున్నారు.







## గ్రేట్ ప్రైమ్ మినిస్టర్.. మన ప్రధానిపై ట్రంప్ ప్రశంసలు

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ చాలా తెలివైన వ్యక్తి అని, గ్రేట్ ప్రైమ్ మినిస్టర్ అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. మోదీతో తనకు మంచి స్నేహబంధం ఉందని తెలిపారు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చలు సానుకూల ఫలితాలను ఇస్తాయని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాకు మంచి స్నేహితుడు. ఆయన చాలా తెలివైన వ్యక్తి. గ్రేట్ ప్రైమ్ మినిస్టర్. మోదీ ఇటీవలే యూఎస్ పర్యటకు వచ్చారు. మా మధ్య మంచి చర్చలు జరిగాయి. అవి ఇరుదేశాలకు ఉపయోగకరమైనవిగా భావిస్తున్నా. కానీ, ఆ దేశంతో నాకు ఉన్న ఏకైక సమస్య ఒకటే. అది సుంకాలు. ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అయితే, సుంకాలను వారు గణనీయంగా తగ్గిస్తారని నేను నమ్ముతున్నా. ఏప్రిల్ 2న యూఎస్ దిగుమతులపై ఎంత సుంకాలు విధిస్తే.. నేను కూడా వారి నుంచి అంతే వసూలు చేస్తా' అని ట్రంప్ పేర్కొన్నారు.

## క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం



నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఐఐటీ మద్రాస్ సహకారంతో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. చెన్నైలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-మద్రాస్' (ఐఐటీఎం)లో శుక్రవారం జరిగిన 'ఆలిండియా రిసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'లో ఆయన మాట్లాడారు. ఐఐటీఎంలో ఆద్యంతం చంద్రబాబు ఎంతో ఉత్సాహంగా, నవ్వుతూ కనిపించారు. విద్యార్థులు సైతం 'జై బాబు.. జైజై బాబు' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, ఆయన ప్రసంగం సమయంలో హర్షధ్వానాలతో హోరెత్తించారు. ఏపీని ఏఐ, డీప్ టెక్నాలజీ హబ్‌గా మార్చుతానని విద్యార్థుల కరతాళధ్వనుల మధ్య చంద్రబాబు ప్రకటించారు. ''దేశంలో 65 శాతం మంది ఏఐ వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు 30 శాతం కన్నా అధికం. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త సాంకేతికతలో విద్యార్థులు ముందుండాలి'' అని ఆయన సూచించారు.1991 ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని గుర్తు చేస్తూ.. ''సంస్కరణలు భారత ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఆర్థిక సంస్కరణలతో చైనా ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. టెలికాం రంగంలో అనేక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ ఆధిపత్యం ఉండేది. సంస్కరణలు రావడంతో ప్రైవేటు సంస్థలు కూడా టెలికాం రంగంలోకి వచ్చాయి.

## జస్టిస్ వర్మ బదిలీ విషయంలో కేంద్రం ఆమోదం

నోట్ల కట్టల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ సుప్రీం కోలీజియం చేసిన సిఫారసుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే, ఆయనకు ప్రస్తుతానికి ఎలాంటి న్యాయపరమైన విధులూ కేటాయించవద్దని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సుప్రీంకోర్టు సూచించింది. మరోవైపు.. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్‌రూమ్‌లో సగం కాలిన నోట్లకట్టలు కనిపించిన నేపథ్యంలో ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలుకు ఆదేశించాలంటూ న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపర వేసిన పిల్‌ను సుప్రీం కోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే సుప్రీం కొలీజియం నియమించిన త్రిసభ్య కమిటీ జరుపుతున్న అంతర్గత విచారణ పురోగతిలో ఉందని ధర్మాసనం గుర్తు చేసింది. అంతర్గత విచారణ అనేది దర్యాప్తు సంస్థలు జరిపే నేర దర్యాప్తునకు ప్రత్యామ్నాయం కాదని, అసలు అది కోర్టు పని కాదని, దాన్ని పోలీసులకు వదిలేయాలని న్యాయవాది నెడుంపర వాదించారు. దీంతో.. ''అంతర్గత విచారణ పూర్తి కానివ్వండి'' అని జస్టిస్ ఓకా సమాధానమిచ్చారు.





## నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 గంటలకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా వేడుకలు నిర్వహించనున్నారు. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆవిర్భావ సభను ప్రారంభిస్తారు. ఈ వేడుకల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్, పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించాలని, ఎన్టీఆర్ విజయ ప్రస్థానం, సీఎంగా చంద్రబాబు సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోలను జిల్లా వ్యాప్తంగా ప్రదర్శించాలని ఆదేశించింది. సుదీర్ఘ కాంగ్రెస్ పాలనకు ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం పార్టీ పుట్టింది. రాష్ట్ర విభజన అనంతరం తెలుగు ప్రజలకు ఏకైక ఆశాదీపం తెలుగుదేశం పార్టీ.. పార్టీ ఆవిర్భావం తర్వాత 10 సార్లు ఎన్నికలు జరుగగా 6 సార్లు అధికారంలో... 4 సార్లు ప్రతిపక్షంలో తెలుగుదేశం పార్టీ ఉంది.

# భర్తపై కత్తి విసిరిన భార్య, అదే కత్తితో భార్యని చంపిన భర్త



భార్యను దారుణంగా హత్య చేసి, మృతదేహాన్ని సూట్‌కేసులో కుక్కి పుణేకు పారిపోయాడు ఒక భర్త. అక్కడ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ సంఘటన బెంగళూరులోని దొడ్డకన్నహళ్లి ప్రాంతంలో జరిగింది. మృతురాలిని 32 ఏళ్ల గౌరీ అనిల్ సంబేకర్ గా, నిందితుడ్ని రాకేష్ రాజేంద్ర ఖేడేకర్‌గా గుర్తించారు. ఇద్దరూ మహారాష్ట్రకు చెందినవారు. గత సంవత్సరం నుంచి ఈ జంట బెంగళూరులో నివసిస్తోంది.బుధవారం రాత్రి ఇద్దరూ కలిసి భోజనం చేస్తుండగా గొడవ మొదలైంది. గౌరీ కోపంతో రాకేష్‌పై కత్తి విసరడంతో అతనికి గాయాలయ్యాయి. దీంతో రాకేష్ అదే కత్తితో ఆమెపై దాడి చేసి అక్కడికక్కడే చంపేశాడు.గురువారం నాడు గౌరీ మృతదేహం సూట్‌కేసులో కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక ఫోరెన్సిక్ విశ్లేషణ ప్రకారం, బాధితురాలి మెడ, పొట్టలో అనేకసార్లు కత్తితో పొడిచినట్టు గుర్తించారు. అనంతరం ఆమె శరీరాన్ని ఎనిమిది నుంచి పది ముక్కలుగా నరికి సూట్‌కేసులో కుక్కాడు."ఈ దంపతులు మహారాష్ట్రకు చెందినవారు, ఒక సంవత్సరం క్రితం బెంగళూరుకు వచ్చారు. సూట్‌కేసులో మృతదేహం ఉన్నట్లు ఇంటి యజమాని పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. మహిళ మాస్ మీడియాలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసింది. నిందితుడు ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతను ఇంటి నుంచి పనిచేస్తున్నాడు" అని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సౌత్ ఈస్ట్) సారా ఫాతిమా తెలిపారు.రాకేష్ నేరం చేసిన తర్వాత గౌరీ తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను చేసిన పనిని గురించి చెప్పాడు. దీంతో భయాందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే మహారాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు.

## నైపుణ్యం కలిగిన విద్యని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచేందుకే 'నో బ్యాగ్ డే' కార్యక్రమం రూపొందించామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. అయన మాట్లాడుతూ.... ఇది విద్యార్థులకు ఒక వినూత్న అనుభూతిని అందిస్తుంది. నైపుణ్యాధారిత విద్యకు ప్రాధాన్యత ఇవ్వడమే మా లక్ష్యం. 'నో బ్యాగ్ డే' అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది విద్యావ్యవస్థలో ఒక నూతన శకానికి నాంది పలుకుతుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరింత ఉత్సాహంగా, సంతోషంగా విద్యను అభ్యసిస్తారని ఆశిద్దాం" అని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ... విద్యార్థుల జ్ఞానాన్ని పరీక్షించేందుకు, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు క్విజ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యార్థులకు వివిధ వృత్తులపై అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇస్తారు. సమకాలీన అంశాలపై నిపుణులతో సెమినార్లు నిర్వహించి, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తారు. విద్యార్థుల్లో శారీరక ధారుడ్యాన్ని పెంపొందించేందుకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. డ్రాయింగ్, పెయింటింగ్, సంగీతం, నృత్యం వంటి లలిత కళల్లో విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీస్తారు. విద్యార్థులకు రాజకీయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు మాక్ పార్లమెంట్ నిర్వహిస్తారు.

